# 7
# గూడు కుదిరిన పక్షి

నిన్నగాదు ఇయ్యాల్లగాదు. యాడాదినుంచి.... అంటే కొమురయ్య లగ్గమైన మరుసటేడు నుంచే, ఆలుమగల నడుమ రగులుతున్న చిచ్చు ఇయ్యాల్ల బర్రె పెండకాడ బయటవడింది.

" ఏదో జరిగింది. అయింది పొయింది. ఇంటిముంగట కోడలున్నదన్న భయమే లేదు. వాళ్ళు వీళ్లు ఏమనుకుంటరు. ఎప్పుడు వడితే అప్పుడు యాల్లపాల్ల లేకుంట గాయిన ఇంటిముందుకచ్చుడేంది" మొదటిసారి కొమురయ్యతో అన్నప్పుడు భార్య మాటల్ని కొట్టిపారేశిండు. అయినా వదురుడు మానలేదు నర్సవ్వ. చెవ్వులో జొర్రీగయింది.

అయినా ఇంతవరకూ ఆ ఆలోచనే రాలేదు కొమురయ్యకు. ఇయ్యాల్ల లచ్చిమక్కమాటలు విన్నంక తలదిరిగిపోయింది. రోజు బర్రె కుడిది తాగినంక తట్టచేతులవట్టిండంటే జంగిడి ఎంబడి తిరిగి నాలుగుతట్టలు నింపి పెంటలేసేదాక కొమురయ్యకు నిద్రవట్టది.

ఈ రోజూ కొమురయ్య అట్లనే తట్టవట్టిండు.

" కొమురయ్యా.... జరంత పక్కకు జరుగు. బర్రెపొడుత్తది." మర్యాదగనే చెప్పింది లచ్చిమక్క ఎనుకనుండి పదిపన్నెండు బర్లు. అన్నింటిని కలుపుకుని దమాయించుకత్తుంది. బర్లెనుక ఇద్దరుముగ్గురున్నరు తట్టలతో. పక్కకు జరిగిండు కొమురయ్య.

నాలుగు అడుగులువెయ్యనేలేదు. తోక ఎత్తి నిలబడింది బర్రెపెయ్య. 'అగోపెండ' అన్నడు కొమురయ్య.

" నేనేముందు చూసిన" ఇంకో పిల్లగాడు అన్నడు.

"అది పోశమ్మ బర్రె. గురుజుకాన్నుండి నేనే కొట్టుకత్తున్న. పెండనాది" అన్నది లచ్చిమక్క.

'గట్లెట్లయితది.నేనేముందుగల్ల చూసిన' అంటూ తట్టకెత్తిండు కొమురయ్య.

లచ్చిమక్క ఇడిసిపెట్టలేదు.ఎద్దుఎవుసం లేదు గానీ నాలుగుపెంటలు కూడేసి ఆయిటి ముందట రైతులకు అమ్ముతది. కొమురయ్య తట్టకు ఎగవడి గుంజుకుని తనతట్టలో కుమ్మరిచ్చుకుంది.

కొమురయ్య జరంత తిక్కమనిషి. మంచిమాటకే మంచోడు. తలికాయ తిరిగిందంటే ఎవ్వలకు ఇనడు. లచ్చిమక్కకేసి ఉరిమినట్టు చూసి తట్టను గుంజుకుని తన తట్టలోవేసుకుని వెనక్కి తిరిగిండు.

లచ్చిమక్క కలెవడ్డది. చేతికున్న రెండు గాజులు పలిగినయి. చేతుకు గీరుకపోయి రక్తం కారింది. లచ్చిమక్క గాయికెత్తుకుంది.

" నీ నోట్లెమన్నువడ. నీ తలపండువలుగ. పొద్దుగల్ల పొద్దుగల్ల రక్తం జూత్తిని గదరా! ఒక్కయ్యకు పుడితే నీతి జాతి ఉంటుండె. నీగడుసు బొందవెట్ట...."అన్నది బిగ్గరగా.

కొమురయ్యకు గుండెమీద గుద్దినట్టయింది. వెనక్కి తిరిగి కోపంగా చూసిండు. లచ్చిమక్క అట్లనే తిడుతుంది. లొల్లికి అందరూ అటే చూస్తున్నరు. ఒకరిద్దరు నవ్వుకుంటున్నరు. కొమురయ్య పటపట పండ్లు కొరుక్కుంట తట్టలపెండను ఇసిరికొట్టి గులుక్కుంట ఇంటివైపు నడిచిండు.

ఇంటి దగ్గరిదాకా లచ్చిమక్క మాటలు వినపడుతనే ఉన్నయి. తన మొగడినే తిడుతుందని తెలువక 'పొద్దుగల్లనే ఎవలనో కడిగిపోత్తుంది' అనుకుంది నర్సవ్వ. ఇంటిముందు నుంచి లచ్చిమక్క పోతుంటే 'ఏమైందక్కా ఎవలేమన్నరు..?' అన్నది.

లచ్చిమక్క ఉరిమిచూస్తూ " అవ్వో.... అక్కా...పొక్కా... అంటున్నావు. యాడపుట్టినోడు యాడపెరిగినోడు. నా తట్టగుంజుకుంటాడు....వీనిల్లు మునుగ. వీనిమొదలార. నల్లమొఖంముండలు తీటకు గంటరు. వాడకట్టుకున్నా దరిద్రమే! సంసారులను సన్నాసులను జేత్తరు" చేతులాడిస్తూ నిలబడి తిడుతుంది.

ఇదంతా దూరంనుంచి సూత్తనే ఉంది గోపవ్వ. కొడుకును తిడుతుందని గ్రహించింది. 'చేటెరుగనిబొడ్డి మొగని పెండ్లి వోయినట్టు ఈ పిచ్చిది జూసినావు! తిట్టేది దీనిమొగన్నెనాయె! ఎవలేమన్నరని అడుగవట్టె' అనుకుని అలుకుడు కుండను పక్కకువెట్టి వాకిట్లకచ్చింది.

గోపవ్వను చూసి మరింత జోరందుకుంది లచ్చిమక్క. గోపవ్వకు కోపం ఆగలేదు.

" సంసారులెవ్వలు, సన్నాసులెవ్వలే..? నువ్వ సంసారివని మురుత్తన్నవా? ఇయ్యాల్ల అందరు

పతివ్రతలైపోయింద్రే.....పిల్లి పాలు తాగేది ఎవ్వలకు తెల్వదనుకుంటది. నీసంగతి నాకు తెల్వదాయె. గద్దాములల్ల దొరికిన్నాడు ఎవలకు జెప్పినవే! ఇద్దరినిడిసి మారుమానం రాలేదే....?" నెత్తెంటికలు ముడేసుకుని సింగులు ఎగజెక్కుకుంటూ ముందుకుపోయింది గోపవ్వ.

నెత్తిమీద తట్టను కిందికిదించి కయ్యానికి దిగింది లచ్చిమక్క "ఏందే లావు మాట్లాడుతున్నవు. నీలెక్క ఇద్దరికి సంసారం జేసినానే.....ఊరికిన్ని నీళ్లు తాగిరాలేదే....బతుకచ్చినదానివి కుద్దు కురాడై పోతివేందే...?" అందుకుంది.

గొల్లుమని లొల్లి. వాడకట్టు జమకూడి వినోదం చూస్తున్నరు. ఎవరు ఎవరికి తీసిపోతలేరు. లొల్లికి బర్లజంగిడి బెదురుతుంది. ఇద్దరూ రేవురేవున పెట్టి తిట్టుకుంటున్నరు. లచ్చిమక్కదే పైచేయి అయింది. తప్పులన్నీ ఎత్తి చూపుతుంది. కొమురయ్యకు తలకొట్టేసినట్టయితుంది. ఇంట్లకు వాకిట్లకు తిరుగుతుండు. పోయేదాన్ని పోనియ్యక పొగవెట్టినవని భార్యను తిడుతుండు.

ఎవలు చెప్పింద్రోగని లచ్చిమక్క కొడుకు ఉరికచ్చిండు. కొమురయ్య వయసే! బూతుమాటలతో గోపవ్వ పైకి ఇరుసుక పడ్డడు. కొమురయ్య కొద్దిసేపు బీరిపోయి నిలవడ్డడు. ఇనబుద్దిగాక 'అవ్వా నువ్వు లోపలికి నడువే' అన్నడు. గోపవ్వ ఇనలేదు. చేతనైన కాడికి ఇద్దరితో ఎదురుదాడికి దిగుతనే ఉంది.

కుత్తిమీసాలు తింపుకుంటూ లచ్చిమక్క కొడుకు మీదిమీది కత్తుండు. కొమురయ్యకు నోరు ఆడుతలేదు. మనసు కుతకుత ఉడుకుతుంది. రెండు మూడు మాటలన్నడుగనీ గట్టిగా రాలేదు. కోపాన్నంతా తల్లిమీద చూపిస్తూ 'నువ్వు ఇంట్లకు నడుత్తవాలేదే....తాగిన మంచినీళ్లు పెయిన వట్టకుంట' అంటూ గోపవ్వను లోపలికి గుంజుకచ్చి తలుపులు దగ్గరేసిండు. అవుతల చాలా సేపటివరకూ తిట్లు వినిపిస్తనే ఉన్నయి.

గోపవ్వ కోపాన్ని ఆపుకోలేక "నల్లముఖపోడా...నన్ను ఇంట్లకు గుంజుకత్తవేందిరా.... వాడు ఎన్నిమాటలంటుండో సూడు. నువ్వు అన్నోనివి గాదు. సిపాయిలెక్క ఇంట్లకు గుంజుకచ్చిండు. వాని దమ్మెంత వాని అయిశతెంత? జాడిచ్చితంతే నడుము ఇరుగుతుండె. వానవ్వ సక్కుందట. నేను మంచిదాన్ని కాదట." పటపట పండ్లు కొరుకుతూ అన్నది.

కొమురయ్యకు కోపమచ్చింది. పక్కనే ఉన్న నర్సవ్వను చూసి పండ్లు కొరికిండు. "ఈ దిక్కుమల్లెదే చేసింది. దారెంటపొయ్యేదాన్ని గెలికిచ్చి కయ్యం జేసింది" అంటూ బూరెంటికలు అందుకోబోయిండు.

నర్సవ్వ చిర్రుమన్నది. అందకుండా దూరం జరుగుతూ "ఆడరాక పందిరి కురుస అన్నట్టు నన్ను తిడుతవేంది...? తిట్టేటోల్లను తిట్టు. అలుకగున్నననే నా మీదికి ఉరికత్తుండు" అన్నది.

అప్పటికే కాక మీదుంది గోపవ్వ. కోడలు మాటలతో మరింత కాకలవడ్డది. "ఏందే....

తిట్టెటోల్లంటే నన్నేగదనే......తిట్టేదేదో నువ్వేతిట్టు..... ఏంతిడుతవో సూత్త. మీరంత మూటిగట్టి నన్నేం జేత్తరే.....తవుడు తాల్తైవాయె ఉనుక ఊడ్తైవాయె. ఇసొంటోల్లను మత్తుగ జూసిన. నిన్నియ్యల్లచ్చి తాటిమట్టకు ఎదురు దేకవడితివి... ” గోపవ్వ మాటలు పూర్తికానేలేదు అందుకుంది నర్సవ్వ.

“ ఇగో అత్తా....వట్టిగమీదేసుకొని కయ్యంజెయ్యకు. అవుతల ఒర్రినట్టు ఇంట్ల ఒర్రితే సాగది. నేను నిన్నెందుకన్న. ఏమోలావు ఉలికిపడుతున్నవు. నీ దగ్గర నెగులనియ్యని గుణం బాగుంది.....” కావాలనే కయ్యానికి దిగింది.

అత్తకోడండ్ల నడుమ లంకపొగ లేచింది. అప్పుడే కోటయ్య ఇంట్లకు అడుగువెట్టిండు. నెత్తికి రుమాలు, చేతుల సుట్ట, బుద్దగోచి, బనీను....అప్పుడే మందకాడినుండి వచ్చిండు. అత్తకోడళ్లను విచిత్రంగా చూసిండు.

తండ్రివైపు ఇరుగజూసి గులుక్కుంట బయటకు నడిచిండు కొమురయ్య. తనను తాక్కుంటూ వెళ్తున్న కొడుకు వైపు మరింత విచిత్రంగా చూస్తూ అరుగంచున గొంగడి వేసుకుని కూచుని “ ఏంలొల్లే..... నీ లొల్లిపాడుగాను ” అన్నడు కోటయ్య.

కొమురయ్యకు లచ్చిమక్క కొడుకు అన్నమాటలే మెరమెరమంటున్నయి. ఎందుకోగాని ఈ మధ్య అందరూ బనాయిస్తున్నరు. ‘ ఆ పెండ్లి ఎత్తిపోవుడేందోగనీ నేనే నోర్లల్లనానుతున్న’ అనుకున్నడు. చలిమంటకాడ గుసగుసలు. తనను చూడంగనే మతమతాన నవ్వుకునుడు యాదికత్తుంది. లచ్చిరెడ్డి పాలోల్లయితే ఎదురైతే చాలు. తుపుక్కున ఊంచుతున్నరు. మనుసంతా కుతకుత ఉడుకుతున్నది.

ఎటూ మనసున వట్టక పొలం దగ్గరికెల్లిండు కొమురయ్య. నాలుగెకురాలు వరిచేను ఎర్రవడుతుంది. చుట్టూబోర్లు ఎత్తిపోయినా తనబోరు ఎనక్కిరాలేదు. పొలంను చూడంగనే ఏదోయాదికచ్చింది. గుండె కలుక్కుమన్నది.

అక్కడ మనుసున వట్టక ఊర్లెకచ్చిండు కొమురయ్య. కచీరు దగ్గెర అరుగుమీద కూసున్నడు. అరుగుల పొంట కూసుండెటోల్లు బాగా కానూన్‌గా మాట్లాడుతరు. తిర్రెసిమర్రెసి మాట్లాడుతరు. ఎదుటోల్లను నోరుతెరువకుంట జేత్తరు. తనుగూడా అట్ల నేర్చుకోవాలె. ఎవడన్న నోరెత్తితే మాటకు మాటనాలె. నోరు మూయించాలె అనుకున్నడు. కచీరు దిగి అటూ ఇటూ తిరిగిండు. అక్కడగూడా లచ్చిరెడ్డి బిడ్డ పెండ్లిమాటనే వచ్చింది.

ఎన్నడూరాని కొమురయ్య వైపు అందరూ వింతగా చూస్తున్నరు. నవ్వుకుంటున్నరు. అది గమనిస్తనే ఉన్నడు కొమురయ్య. ఎంత ధైర్నంతో ఉండాలన్నా గుండె దడ మొదలయింది. హోటల్‌కు వోయి చాయ తాగిండు. జేబుల పైసల్లేవు. పైసలు రేపిత్తనని మీసాలు తీడుకుంట చెప్పిండు. ‘ అట్లనే తియ్యి ’ అనంగనే ఏదో సాధించినట్టు తృప్తి.

కొద్దిగ ధైర్నమచ్చింది కొమురయ్యకు. అటీటు తిరిగి ఇంటికచ్చిండు. తండ్రి అరుగంచుకే

కూసున్నడు. చుట్ట నోట్లే పెట్టుకుని బక్ బక్మంటుండు. అతని మొకంలోకి చూసింది. ఏ మూలానా కోపం, బాధ ఏదీ లేదు. ఎప్పటిలెక్కనే ఉన్నడు. అత్తాకోడళ్ల మధ్య లొల్లి ఆగిపోయినా ఎవలంతల వాళ్ళే గులుక్కుంటున్నరు. గోపవ్వ కొడలి, సద్ది చేతుల పట్టుకుని బయటకు వెళ్తుంది.

" కొడలి చేతవట్టినవు. యాడికివోతున్నవు." ఎదురుగా నిలబడి అడిగిండు కొమురయ్య. ఆమె ఎక్కడికి వెళ్తుందో తెలువకకాదు. ఎందుకు వెళ్తుందో తెలువకకాదు. వెళ్లకూడదన్న తన నిర్ణయం చెప్పడానికే !

అదే విషయం అర్థమై కోపంగా తలెత్తి చూసింది గోపవ్వ. తన ఉనికినే ప్రశ్నిస్తున్నట్టుగా అనిపించింది ఆమెకు.

" ఏందిరా గట్లడుగుతున్నవు......."

గట్టిగా అనలేకపోయింది. మెత్తమెత్తగా ఉన్నయి మాటలు.

" నువ్వు ఇయ్యల్ల వాళ్ల కోతకు పోవద్దు. మనమే కోతపడుదాం. " సూటిగా చూస్తూ అనలేక దిక్కులు చూస్తూ అన్నడు.

" మన కోతకు ఏం ఎత్తిపోయింది. ఆకుపచ్చిగనే ఉండె. వాళ్లది తారిపోయి ఎండిపోయింది. కొయ్యకపోతే ఎట్లుంటది. " సముదాయిస్తున్నట్టుగా చెప్పింది.

" వాళ్లది వాళ్లు చూసుకుంటరు. మనకేంది? మనది పట్టేదాక ఇంటికాడుండు. ఎవలకూ పోవద్దన్న. అంతే ! " కొమురయ్యకు ఆగమాగముంది. ఎన్నడూ ఇట్ల మాట్లాడలేదు. పని చేయడమేగాని చెప్పడం తెల్వది. మొదటిసారి యుద్ధం చేస్తున్నట్టు భయంభయంగా ఉంది.

కోటయ్య కొడుకువైపు నిరాసక్తిగా చూస్తున్నడు.

గోపవ్వకు అహం మీద దెబ్బకొట్టినట్టయింది. రోషంగా కొడుకువైపు చూసి " నువ్వు చెప్పుడేందిరా! ఇప్పుడు చెప్పే మొగోనివైనవా.....? " అన్నది.

" ఔ.....ఇప్పట్నుంచి నేను చెప్పేమొగోన్నే......నేను చెప్పినట్టే ఇనాలె. " అన్నాడే తప్ప అక్కడ నిలవడలేదు. వంగుకుంట వంగుకుంట వంట్లింట్లకు పోయిండు కొమురయ్య. భర్తను చూసి నర్సవ్వ నవ్వింది. ఆ నవ్వు ఏదో ధైర్నాన్ని అతడిలో నింపింది.

" నువ్వు చెప్పేటోనివి నేను చేసేదాన్నా..... పుర్రెగిట్ల కరావైందారా....." అతడు అందుకోకముందే బయటకు నడిచింది గోపవ్వ.

సుట్టను రు...లులో చెక్కుకుంటూ కోటయ్య ఇంట్లోకి నడిచిండు. తల్లివైపు కోపంగా చూస్తూ ఏదో అనబోయిండు కొమురయ్య.

వాకిట్లో కిర్రుచెప్పుల చప్పుడు వినిపించింది. దించిన తల ఎత్తకుండా విసురుగా బయటకచ్చి

ఎడ్లకొట్టం వద్దకు నడిచిందు కొమురయ్య. రెండుదొడ్ల ఎడ్లు ఒక్కదొడ్డిలోనే ఉన్నయి. మేతకు తోలాలనిపించలేదు. ఇంటికి తిరిగివచ్చి మూలమంచమేసిందు. ఇవేమీ పట్టనట్టు కోటయ్య సద్దిగట్టుకుని మందవైపు ఎల్లిపోయిందు.

ఎడ్లు నీళ్లకు మేతకు కొట్టుకుంటున్నయని తెలిసి కోతలోంచి వచ్చి ఎడ్లకు నీళ్లు పెట్టింది గోపవ్వ. ఎండిన గడ్డి వేసి మళ్లీ కోతకు పోయింది. పగటియాల్ల సద్ది తినబుద్ది గాలేదు. వాళ్లు వీళ్లు ఎందుకు...ఏమైందని అడిగితే కొడుక్కు జరమచ్చిందని పొడి పొడి సమాధానం చెప్పింది. మనసు మాత్రం నాలుగుదిక్కులు తిరుగుతుంది. ఎట్లనో పొద్దుపుచ్చుకుని ఇల్లు చేరింది గోపవ్వ.

కొడుకు కనిపించలేదు. కోడలు బీడీల చాటముందు కూసుంది. పొయ్యిల పిల్లిలెవ్వలేదు. ఉట్టిమీద గిన్నెలల్ల బువ్వ నిండుగా ఉంది. ఎవలూ ముట్టలేదు. పొయ్యి అంటువెట్టి బర్రెకు కుడిది కాగవెట్టిపోసింది.

కొడుకు ఎటుపోయిండని కోడలును రెండుమూడు సార్లడిగింది. ముందు వినపడనట్టె ఉన్నా ' ఏమో ఎటుపోయిండో.....నాకు చెప్పిపోతడా ' అన్నది విసురుగా. గుండెలోదడ పుట్టింది గోపవ్వకు. ' అసలే దినం మంచిగ లేదు. వీడు ఎక్కడికి పాయె ' అనుకుంది. ఇంట్లకు బయటకు తిరుగుతుంది. దోస్తులు కనిపిస్తే ' మా కొమురన్న కనిపించిండా ' అని ఆరా తీస్తుంది.

పండే రాత్రికి తండ్రీకొడుకులిద్దరు వచ్చింద్రు. కోటయ్య ఇంట్లోకి నడిస్తే కొమురయ్య మంచం వాల్చుకుని పండుకున్నడు. గోపవ్వ ఇద్దరినీ గమనిస్తనే ఉంది. కండ్లపొంట నీళ్లు కారుతున్నయి. వచ్చికొడుకు పక్కన కూసుంది. కొమురయ్య మొకం తిప్పుకున్నడు.

' కొమురన్నా.....తిందువులెవ్వు బిడ్డా ' అంటూ తట్టి లేపితే ' నీతాశిలి మొఖం నాకు సూపియ్యకు. ' అంటూ చేయి విసిరికొట్టిండు.

గోపవ్వకు ఏడువేడువంటూ దుఃఖమచ్చింది. " నా తాశిలిమొఖం ఇప్పుడు కనవడుతున్నాదిరా ! అక్కలగ్గం ఇద్దరు చెల్లెండ్ల లగ్గం చేసినప్పుడు కనవడలేదారా నాతాశిలి మొఖం. ఇరువై ఇరువై అయిదేండ్ల కొడుకువైనవు. ఎన్నడన్న సంసారం ఎత్తుకున్నావురా. ఏం ఉన్నది ఏం లేదని అడిగినావురా. ఇంట్ల ఇద్దరు మొగోల్లున్నరు. ఎన్నడన్న ఐదుపైసల ఉప్పుపుట్టిచ్చుకచ్చినార్రా. నాదిగాదురా నీ అయ్యది తాశిలిమొఖం. అన్ని ఎల్లదీసుకచ్చి ముందుకు నడిచినంక నేనెందుకు బయటకు పోదురా..." అంటూ లేచి రెండడుగులు ముందుకు నడిచి వెనక్కి తిరిగి " మీరు ఇప్పుడు మొగోల్లయింద్రు. ఇన్నొద్దులు ఈ తెలివి యాడికి పోయిందిరా....." ఆమె మాటలు అంటనే ఉంది. పండుకున్నోడు గొంగడిని విసురుగా జరిపి లేచిండు కోటయ్య.

" ఏయ్.... ఏంటిదే లావు నీల్గుతున్నవు. ఊకున్నకొద్ది నోరు బాగైతంది....." అరిచిండు.

గోపవ్వకు కోపం ఆగలేదు. " నీ తెలివి తెల్లార. నువ్వు తెలివిమంతునివైనంక నేను నలుగురి

నోర్లల్ల ఎందుకు నానుత. పొగాక్కు పైసలడుక్కుని తెల్లారెద్దాక వాకిట్ల మలుసుక పన్నప్పుడు యాడికిపోయిందీ రేషం. కట్టలకు కట్టలు తెచ్చి కార్యాలు ఎల్లదీసిన్నాడు ఎటుపోయిందీ తెలివి. నెత్తికి చేతులు పెట్టుకొని నడింట్ల ఏడుసుకుంట కూసుంటివి గదా ! ఇల్లు నాలుగెకురాల చేను యాడిదనుకున్నవు." ఆవేశంగా అన్నది.

ఏమనుకున్నడో కోటయ్య ఎక్కడలేని బలంతో ఆమాంతంగా లేచి ముల్లుకట్టెను అందుకున్నడు. 'ఏంటిదే.....పాపం పోనని ఊకుంటే నోరు పెద్దగ జేత్తున్నవు. ఏమనిపిత్తందే...... ఈపుల ముల్లు వెరిగిందా...' అంటూ కట్టెతో కొంకులపై కొట్టిండు.

కట్టెను అందుకుందామని ముందుకు తిరిగింది గోపవ్వ. కట్టె అందలేదు. మోకాల్ల కింద నరానికి కటుక్కుమని తాకింది. ఇలిలా తండ్లాడింది గోపవ్వ. బర్రెను జోపినట్టు జోపుతున్నడు కొటయ్య. ఎన్నొద్దుల నుండో గూడుకట్టుకున్న కసి ఇప్పుడు బయటపడుతున్నట్టుగా ఉంది.

ముందుగా వట్టిగా బెదిరిస్తున్నాడనుకుంది గోపవ్వ. ఒకటి రెండు దెబ్బలేసేసరికి భయం పుట్టుకచ్చింది. ఇంతవరకు ఎప్పుడూ ఆ కోపం చూడలేదు. చూత్తేనన్నా జాగ్రత్త పడేదేమో! భయంతో వణుకుపుట్టింది. ఒంటిమీద వాతలు తేలుతున్నయి. ఎక్కడ తాకుతుందీ చూడకుండా పిచ్చిపట్టినట్లు కొడుతనే ఉన్నడు. కోటయ్య. గోపవ్వ గుండె అవిసిపోయేలా అరుస్తుంది. అతడితో పెనుగులాడి ఓడిపోతంది.

"వద్దురో...నీబాంచెన్‌రో...నీకాళ్లు మొక్కుతరో...కొట్టకురో...కొమురన్నా... జర అగవట్టురా...నన్ను ఉంచదురా...సంపుతదురా...దొరకవట్టురా...నర్సావ్వా...నువ్వన్నా చెప్పుబిడ్డా.... నీ కాళ్లు మొక్కుతనే....వావ్వో...వాయ్యో....కొట్టకురో బాంచెన్‌రో...." దెబ్బ ఎక్కడపడితే అక్కడ తడుముకుంటూ అరుస్తుంది.

కొమురయ్య పక్క బొర్రియ్యలేదు. మంచంలోంచి లేవ్వలేదు. నర్సవ్వ లేచింది. అరుపులు బయటకు వినిపించకుండా తలుపులేసి ముడుచుకుని పడుకుంది.

ఎప్పుడో పొద్దున తిన్న పిడికెడు మెతుకులు గోపవ్వకు. పొద్దంతా వంగీ వంగీ కొంకశీలిపోయిన నడుము. సల్లచెమటలు పుట్టి ఇరుసుకపడిపోయింది.

చేతుల కట్టెపొట్టుపొట్టయింది కోటయ్యది. విసురుగా కిందపడేసి "దరిద్రపు ముండా! బాగా కావురమచ్చి తిరుగుతున్నవు. నలుగురు నాలుగు మాటలంటుంటే చెవులు చిల్లులు పడుతున్నయి. తెల్లారెవరకు నీమొఖం కనిపియ్యద్దు. కషికెడంత రేషమున్నా ఉరివెట్టుకుని సావు. నల్లమొఖంముండ..." దమ్ము తీసుకుంటు అన్నడు. తిట్టుకుంటనే కొద్దిసేపు ఇల్లంతా తిరిగిండు. చుట్ట ముట్టించుకుని నెమ్మదిగా తాగి నిద్రలకు జారుకున్నడు.

గోపవ్వకు రక్తందారలు కట్టింది. తల తిరుగుతుంది. ఏడ్వడానిక్కూడా ఓపికలేదు. అంత బాధలోనూ కొడుకు కోడలు ఇద్దరూ యాదికచ్చింద్రు. లెవ్వాలనిపించలేదు. అలాగే ముడుచుకుని

పడుకుంది. భర్తమాటలు యాదికత్తున్నయి. నేను నల్లమొఖం దాన్నా... ఉరివెట్టుకుని సావన్నా... తెల్లారెవరకు కనవడద్దట...ఎటుపోవాలె...నలుగురు నాలుగు మాటలు ఇయ్యల్లనే అంటున్నరా...?

ఆ నాలుగు మాటలు నేను మాత్రం పడుతలేనా...? ఎంత ఆత్మను సంపుకుంటున్న. నాకు మాత్రం ఆకుసాటు పిందలెక్క బతుకాలని లేదా...? ఈ కొట్టుడు ఇరవైఏండ్లకింద కొట్టినా ఇంట్లకాలు అవుతల పెట్టకపోదును. నన్ను బజారుమీదేసింది వీళ్ళే కదా!.....' మనసు తల్లడమల్లడమౌతుంది. ఇంట్లకు చెప్పుకాలు అడుగువెట్టి ఇరువైఏండ్లవుతుంది. ఇన్నేండ్లు ఉగ్గబట్టుకున్న దుఖం,బాధ ఇప్పుడు కండ్లపొంట నీళ్లయి కారుతుంది.

తల్లిలేని గోపవ్వను తండ్రి ఇల్లరికం పెట్టుకున్నడు. తల్లిదండ్రిలేని కోటయ్య పదమూడేండ్ల వయసులోనే ఇలిటపు అల్లునిగా ఇంట్లోకి అడుగుపెట్టిండు. అడుగుపెట్టిన ఏడాదికే తండ్రిచనిపోయిండు.ఎకురం మోటపొలంచిన్నగుడిసె మిగిలింది. ఆడిపిల్లకు పాలు ఎక్కడిదనీ చిన్నాయినలు, పెద్దనాయినలు తిరుగవడ్డరు. చేనును మలుపుకున్నరు. గుడిసెను అంటువెట్టిండ్రు. అయినా మొండిగా నాలుగైదేండ్లు కొట్లాడింది గోపవ్వ. నిలువనీడ లేకుండ చేసిండ్రు.

కోటయ్యను సావగొట్టిండ్రు. ఇగ అక్కడుంటే బతుకమని అర్ధరాత్రి బయిలెల్లి ఈ ఊరచ్చిండ్రు. అప్పటికి గోపవ్వ సంటిపిల్ల తల్లి. అనుమండ్ల చెట్టుకింద దిగిండ్రు. కోటయ్య బాగలేదు. కూతురు పెద్దది. మాటలు నేరుత్తుంది. కొడుకు సంటిపిల్లగాడు. పోశమ్మ జరమచ్చింది. సల్లటిసలి. కట్టబట్టలేదు. తినతిండిలేదు. చేతుల పైస లేదు. కోటయ్య బతుకడనుకుంది.

లచ్చిరెడ్డి కొట్టంల తావిచ్చిండు. కైకిలి పిలిచిండు. పాతబట్టలిచ్చిండు. ఐదు నాగండ్ల ఎవుసం. కోటయ్యను, కొడుకును దవఖాన్ల చూపిచ్చిండు. సచ్చిపోతడనుకున్నోడు బతికిండు. కొడుకు గూడ రివరివయిండు. మూడుపూటల తిండి దొరికింది. కోటయ్య జీతానికి కుదిరిండు.

యాడాది బాగానే గడిచింది. తర్వాత అక్కడ ఉండద్దని పోరువెట్టింది గోపవ్వ. ఇంటికిపోదాం లేదంటే ఎక్కడికన్నా పోదాం. ఇక్కడ మాత్రం ఉండవద్దన్నది. ఆమె ఎందుకలా అంటుందో అర్థమయింది కోటయ్యకు. ఇంటికిపోతే పానభయం. వేరే ఊరికి పోతే బతుకు భయం. ఇంట్ల గోపవ్వ పోరు.

మునిమాపున లేచి చెప్పచెయ్యకుండా మాయమైపోయిండు కోటయ్య. ఆరునెలలకు గానీ ఇంటిమొకం చూడలేదు. ఇంటికి వచ్చినంక పోదామన్న మాటను మళ్లీ ఎత్తలేదు గోపవ్వ. గుడ్లనీళ్లు గుడ్లల్లనే కుక్కుకుంది. కోటయ్య పెద్దపాలేరయ్యిండు. గోపవ్వ గుండెరాయయింది.

తలుపు తట్టిన చప్పుడు వినిపించింది. గోపవ్వకు ఆలోచనలు తెగిపోయినయి. ఎవరో పిలుస్తున్నరు. మగతనిద్రలోనే అది తమ్ముడిగొంతని గుర్తువట్టింది. దుఃఖం ఎగదన్నుక చ్చింది. ఎవరైనా తలుపు తెరుస్తరని చూసింది. ఎవలూ తెరువలేదు.

లేచికూసుంది గోపవ్వ. తలదిమ్మంది. కండ్లు తిరిగినట్టయినయి. పెయ్యంతా కమిలిపోయి వాతలు దేలి మండుతుంది. తమాయించుకుని లేచింది. అడుగు ముందుకు పడటం లేదు. కక్కచ్చినట్టయింది. కడుపులలోపింది. దిగమింగుకుంట వెళ్లి తలుపు తెరిచింది. చేతులకాయిదాల చుట్టతో బీరయ్య.

గోపవ్వకు దుఃఖం ఆగలేదు. మీదపడి బావురుమంది. బీరయ్య కదిలిపోయిండు. అక్కకు ఏ ఆపతి వచ్చిందోనని భయపడిపోయిండు. పైస పలానికి, పంచాదులకు, పోలీసుకేసులకు చుట్టాల బలగంకు అందరికి గోపవ్వనే ధీమయింది. ఎవలకు ఏ ఆపద వచ్చినా లచ్చిరెడ్డితో చెప్పించి తీర్చేది.

“ అక్కా ఏమయిందే...... ఎందుకేడుత్తున్నవే........” వీపును తడుముతూ అన్నడు బీరయ్య.

అప్పుడు తగిలింది బీరయ్యచేతికి తడిగా జిగురుగా చిక్కటిరక్తం. ఉల్కిపడి లైటు వెలుతురులో అక్కను పరిశీలనగా చూసిండు. పెయ్యంతా వాతలు దేలినయి. ఓదార్చి అడిగితే వెక్కుతూ కూసుంది తప్ప మాట చెప్పలేదు. బావ మంచం దగ్గరికి పోయి లేపి కూసోవెట్టి కోపంగా అడిగిండు బీరయ్య.

“ఔ...కొట్టిన.ఇంక కొడుతనా రెండుగ జీరుతనా...రేపు జూడు. దాని గతి ఎంతకుందో... అదన్నా ఉండాలె మేమన్నా ఉండాలె...” కొడుకు కోడలును కలుపుకుంటూ అన్నడు.

ఇన్నిరోజుల నుండి చూస్తున్న బావకు, ఇప్పుడు చూస్తున్న బావకు ఏదో తేడా కనిపించినట్టయింది. ఎందుకయినా మంచిదని భూమి పంచాయతి గురించి అక్కకు చెబుదామని తెచ్చిన కాగితాలను ఎవరూ చూడకుండా జేబులో పెట్టుకున్నడు.

“ అది నా యింట్ల ఉండద్దు. నాతోని ఉన్నా లత్తనే. రేపు మీ అక్కను నువ్వు తొలుకపో... మల్లా నా కడుప తొక్కితే పాతరవెడుత...” వదురుతున్నడు కోటయ్య.

‘ఏటి మొఖపోనివిరా... ఇయ్యల్ల నీ ఇల్లయిందా... చేను, ఇల్లు, కొట్టం,ఎడ్లు, గొర్లు నీయేనా... నువ్వే కట్టంజేసి సంపాయించినవా...? నువ్వు చేసిందీ నీ సుట్టపొగాక్కు కల్లునీల్లకు సాలలేదు....!’ పైకి అనడంలేదు గాని గోపవ్వ మనుసులో మెదులుతున్న మాటలు.

“ ఇంతకు మీకు యాడవద్దది.... అది ఏమన్నదని గట్లకొట్టినవు....” సముదాయిస్తున్నట్టుగా అడిగిండు బీరయ్య.

“నన్నుగాదు. ఊర్లెకుపోయి అడుగు చెప్పుతరు. మేం తాగిన మంచినీల్లు కూడా మందికి ఎరుకైతున్నయి. వాడు బిడ్డలగ్గానికనితెచ్చిన పైసలు దీనికే ఇచ్చిండట. యాల్లకు కట్నమియ్యలేదని లగ్గం ఎత్తిపోయిందట.ఊరుకోదై కూత్తంది...చెవులు ఇనత్తలెవ్వు....” తుపుక్కున ఊంచి రేషంగా సరాయించిండు కోటయ్య.

సటుక్కున నెలరోజుల కిందటి ముచ్చట యాదికచ్చింది బీరయ్యకు. పక్కపొలపోల్లు బోరువేత్తే

తన బోరుబాయి సుక్క నీళ్లు లేకుంట ఎండిపోయిందని, నాలుగెకరాల పొలం బీర్రు పొట్టమీద ఉందని నెత్తికి చేతులు పెట్టుకుని కూసున్న బావ గుర్తుకచ్చిండు. 'ఎట్లన్న చేసి ఇంకో బోర్ ఎయ్యాలె. మోటర్ తేవాలె. లేకుంటే చేను పంట ఒక ఇత్తు చేతుకురాదు. చేతుల ఒక్క పైసలేదు ఎట్ల' అని తొక్కులాడుతున్న అక్క గుర్తుకు వచ్చింది.

ఇప్పుడు కర్ర ఎర్రవద్దది. బావది కన్నెర్రవద్దది. సముదాయించాలని చూసిండు. కోటయ్య వినడం లేదు. వారి మాటలు వింటూ మూలుగుతూ అట్లనే ముడుసుక పడుకుంది గోపవ్వ.

ఎప్పుడు నిద్ర పట్టిందో లేచేవరకు బలబల తెల్లారుతుంది. తమ్ముడి మంచం ఖాళీగా ఉంది. కోటయ్య నిద్రపోతున్నడు. కోడలు ఏదో సదురుతుంది. గోపవ్వపానం కలకలాంది. చలిజరం అందుకుంది. రక్తం పక్కు గట్టింది. మళ్లీ కన్నంటుకున్నట్టయింది. లేచి చూస్తే కరకర పొద్దు పొడిచి బారెడెక్కింది.

అయ్య, కొడుకు, కోడలు నవ్వుకుంట ముచ్చటాడుతున్నరు. కోత ఎన్నడు పట్టాలెనో ఎక్కడ కల్లంలేపాలెనో పొలి ఎక్కడ చెయ్యాలెనో ఆలోచిస్తండ్రు. తమ్ముడికోసం మరోసారి చూసింది. కనిపించలేదు. కోడలు సామాన్లు కడుతుంది. కొడుకు సైకిల్ మీద ముల్లెలు పెడుతుండు.

పానం దస్సుమంది గోపవ్వకు. అంత జరంలోనూ లేచికూసుంది. ముల్లెలు బయటకు పోతున్నయి. సొలుక్కుంట సొలుక్కుంట కొడుకు దగ్గరికి పోయి కూరుకుపోయిన గొంతుతో ' ముల్లెలు ఎక్కడికిరా ' అని అడిగింది.

ముగ్గురిలో ఎవరూ సమాధానం చెప్పలేదు. కొడుకు మాత్రం ఇరగజూసిండు. కోడలు విననట్టె పనిలో మునిగిపోయింది. ' ఇయ్యల్ల మంచిరోజట. పాలుపొంగియ్యాలె. జెట్టనరాండ్రిరా ' అంటూ కోటయ్య మాత్రం బయటకు నడిచిండు. గోపవ్వకు విషయమేమిటో అర్థమైపోయింది. రేషం ముంచుకచ్చింది. అంతజరంలోనూ లేచినిలవడ్డది. మొఖం మీద నీల్లుజల్లుకున్నది. బొడ్డె సంచి, బట్టలు సదురుకున్నది.

" మీరు ఇంట్లనుంచి పోవుడేందిరా...నేనేపోతన్న. మీరే ఉండుండ్రి....మీకండ్లు సల్లవడుతయి. అయ్య కొడుకులు బదులుకొని నన్నేంజేత్తర్రా..." అంటూ సొలుక్కుంట బయటకు నడిచింది.

రేషంగా బయటకు వచ్చిందిగనీ ఎక్కడికెల్లాలెనో తోచలేదు. 'నాలుగు రోజులుంటే కుక్కలెక్క అవ్వా ఎటుపోతివే అని వాడే అత్తడు గాడిదికొడుకు ' అని పెద్దబిడ్డ ఊరికి పొయ్యే బస్సెక్కింది.

హఠాత్తుగా ఊడిపడ్డ అవ్వను చూసి పెద్దబిడ్డ పరేషానయింది. మీదవడి ఏడ్చి అంతా చెప్పుకుంది తల్లి. బిడ్డమొకంలో రంగులు మారినయి. పైకి ఏమీ అనలేదు. కన్నీళ్లు తుడిచింది. అల్లుడు వచ్చిండు. అత్తతో మాట్లాడలేదు. గండుపిల్లిలెక్క మొకం పెట్టిండు. ' ఈయన్నేమన్న వచ్చినప్పుడు కాయిపాయి కమ్మగ పెడితి. అడిగినప్పుడల్లా కట్టలకు కట్టలు చేతికిత్తి. ఇప్పుడే యాదిమరిచిండా ' అనుకుంది.

అల్లుడు బిడ్డపై రుసరుసలాడుదు చూస్తనే ఉంది.

‘ అత్తచేసిన మంచిపని ఇక్కడగూడ ఎరుకగావాలని వచ్చిందటనా ’ అన్న మాట అల్లుని నోటి నుండి విన్నంక ఒక్క గడియ కూడా నిలువబుద్ది కాలేదు. బిడ్డ ఎంత వద్దని బతిమిలాడినా వినకుండా తెల్లారే బస్సెక్కింది గోపవ్వ.

ఇంటికి వెళ్లబుద్ధి కాలేదు. మొండికి తిరుగుతుందిగనీ పెయ్యంత నొప్పులుపుట్టి జరంతో అడుగుతీసి అడుగు వెయ్యస్తలేదు. ఎమన్నగానని అన్న దగ్గరికి పోయింది. అప్పటికే తమ్మిడి ద్వారా విషయం తెలుసుకున్న అన్న నిరాసక్తిగా కనిపించిండు. సంసారాన్ని కరాబు చేసుకోవద్దని చెప్పిండు.

‘ చీ....ఏం తిరుగుడు పాడయింది. ఎవలో అయితరన్నది కల్ల. నాయింట్ల నేను ఓమూలకు పడి చావక ఎందుకచ్చినట్టు ’ అనుకుంది. అంతకుముందు వచ్చిన్నాడు తనకు జరిగిన మర్యాదలతో పోల్చుకుంది. మరునాడే ఇంటిమొఖం పట్టింది. ఎవరూ వద్దని చెప్పలేదు.

ఇంటికి చేరుకునేసరికి పొద్దుగూకింది గోపవ్వకు. ఇంటికి తాళమేసి ఉంది. కొడుకు దగ్గరికి పోదామనుకుంది. కాళ్లు రాలేదు. అక్కడే అరుగుమీద కూసుంది. ఏడుద్దామన్నా కడుపులో బాధ తప్ప కన్నీళ్లు లెవ్వు. ఇల్లు గట్టి పదేండ్లవుతుంది. లంకంత ఇల్లు. ఎన్నడూ అట్ల దీనంగా సూరుకింద కూసోలేదు. ఇల్లు తన ఇల్లులా కాదు పరాయి ఇల్లులా ఉంది.

చీకటిపడుతుంది. ఇరుగూ పొరుగూ వచ్చి ఆసక్తిగా తొంగి చూసి పోతున్నరు. అందరూ ఆపదలకు సంపదలకు అప్పుసప్పుల కొరకు వచ్చినోల్లే! అక్క చెల్లె అని వెంట తిరిగినోల్లే. కొత్తగా అంటరాని వస్తువునేదో చూసినట్టుగా చూస్తున్నరు.

ముదుచుకుని కూసుంది గోపవ్వ. పాకల బర్లులెవ్వు. ఎండిన తొక్కుడు గడ్డి ఉంది. గుయ్యిమని చుట్టుకున్న దోమలు అందినకాడ అందినంత రక్తాన్ని పీలుస్తున్నయి. వాటిని కొట్టడానిక్కూడా ధ్యాస లేదు. నెత్తి నిండా కొంగు కప్పుకుని కూచుంది. అట్లనే మగతలోకి జారుకుంది.

ఎవరు చెప్పింద్రోగనీ సాకల్ది ఊరు తిరిగేయాల్లన ఇంటిసాకలితోనీ తాళం చెయ్యి వచ్చింది. ఆమె లేపేవరకూ లెవ్వలేదు గోపవ్వ. జోలెను చూసినంక ఆకలి గుర్తొచ్చింది. ఎక్కడా నాలుగు మెతుకులు ఎంగిలి పడబుద్దిగాలేదు. మనుసును సంపుకుని నోరు తెరిచి సాకలిదాన్ని అన్నమడిగింది.

“ నీ బాంచెను బిడ్డా గోపవ్వా....నీ చేతనే నలుగురికి దానం చేసినవు. నీకు పిడికెడు మెతుకులు పెట్టలేనా...? నువ్వు ఎంతమందిని గద్దకు తియ్యలేదు..... ఇంట్లకు నడువుబిడ్డా....ఇయ్యాల్ల ఇల్లు భూమిజాగలు అన్ని వసతులైనంక మొగోల్లమని యాదికచ్చిందేమో....” లేవదీసి ఇంట్లోకి నడిపి ఒడిలో అన్నాన్ని తొక్కును దులిపింది.

ఆగమాగాన నాలుగుబుక్కలు తిన్నది. తర్వాత సహించలేదు. చెంబెడు నీళ్లు తాగి ముడుచుకుని

పండుకుంది గోపవ్వ. కలకలానుకుంట కడపదాటింది చాకలి.

☆☆☆☆

" ఇంక సిగ్గులేక మల్లచ్చింది. ఇజ్జతుకు యాడనన్న పడి సత్తదనుకున్న. దరిద్రపుముండ" గులుక్కుంటున్నడు కోటయ్య.

కిరాయి ఇంట్లో కోడలు ఉల్లాసంగా తిరుగుతుంది. మొగనికి మామకు అప్పుడప్పుడు మాటలతో పొగేస్తుంది.

" అక్క దగ్గరికి పోయిందట. బావ కోప్పడ్డడట. పెద్దమామ దగ్గరికి పోయిందట. అక్కడ ఏమన్నరో...." కొమురయ్య అన్నడు.

" ఏమంటరు మెచ్చుకుంటరు. మొన్న ఆ నల్లమొఖపోడు వచ్చి మల్లా మొఖం చూపియ్యకుంట పోయిండు గదా..... ఈ నల్లమొఖపోడు గూడా మొఖం దాసుకొంటడు." నెమ్మదిగా చుట్టతాగుతూ కోటయ్య అన్నడు.

" సాకలిదాన్ని బువ్వ అడుక్క తిన్నదట. ఇక్కడికి రానుండె. పెడుదునో పెట్టకపోదునో చూడనుండె. మందిని అడుక్కతిని బదునాం చేసుడేకదా. అయినా ఇంట్ల బియ్యంలెవ్వా! వండుకొని తిననుండె. ఎవలన్న జూత్తె కోడలు బియ్యం లేకుంట చేసిందని అనాలెనని......సాకలిదానితోని ఇంకేం చెప్పిందో...." కోడలు అన్నది.

" ఆరేయ్....కొమురయ్యా ! మనం ఎవ్వలం అటు దిక్కుపోవద్దు. ఎన్నిరోజులు అడుక్కతింటదో చూద్దాం. సాకలిది ఎక్కువయింది మనం తక్కువైనమా....." నిద్రలోకి జారుకుంటు అన్నడు తండ్రి.

రెండురోజులు గడిచినయి. ఎవలూ ఇంటిదిక్కు చూడలేదు. గోపవ్వ కూడా అటువైపు పోలేదు. నాలుగవనాడు పొద్దున ఎవరో చెబితే తండ్రికొడుకులిద్దరూ మొత్తుకుంటూ వచ్చింద్రు.

గోపవ్వ ఒడ్డుమీద నిలబడ్డది. మిషిని కోతగోసి వడ్లను రాశిపోస్తంది.

(నడుస్తున్న చరిత్ర మాసపత్రిక ఫిబ్రవరి 2003 కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ)